క్లుప్తంగా

ఆలయ ఉత్సవ కమిటీ ఎన్నిక

అరకులోయటౌన్: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ఉత్సవ కమిటీని గురువారం నియమించారు. మే నెల 8 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు సంబంధించి కమిటీ ప్రతినిధులుగా విజయనగరం ఆర్టీసీ రీజన్ చైర్మన్ దొన్నుదొర, బాలకృష్ణ, రాంబాబు, చిట్టిబాబు, ఆనందరావు, బొంజుబాబు, రఘునాథ్, బాబూరావు, అప్పన్న, కామేష్, అప్పలరామ్, రమేష్, రామారావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

బార్ అసోసియేషన్లకు ఐలాజ్ సంఘం మద్దతు

అడ్డతీగల: రంపచోడవరం,అడ్డతీగల బార్ అసోసియేషన్లకు ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగతా శివ, రాష్ట్ర కోశాధికారి అవసరాల దేవి, రాష్ట్ర కమిటీ సభ్యులు దమ్ము శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ అనుమతితోనే ఏజెన్సీలోని రెవెన్యూ కోర్టుల్లో ప్రాక్టీస్ చేయడానికి అర్హులుగా నోటీసుల్లో రంపచోడవరం సబ్ కలెక్టర్ పేర్కొనడం తగదన్నారు. నోటీసులను సబ్ కలెక్టర్ రద్దు చేసే వరకూ పోరాడుతున్న రెండు బార్ అసోసియేషన్లకు ఐలాజ్ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఐలాజ్ పూర్తి మద్దతు ప్రకటిస్తూ చేస్తున్న పోరాటాల్లో భాగస్వామిలవుతామన్నారు.

దుప్పిలవాడలో ఉపాధి పనుల కల్పన



ఉపాధి పనులకు వెళ్తున్న దుప్పిలవాడ గిరిజనులు

సాక్షి ఎఫెక్ట్..

గూడెంకొత్తవీధి: దుప్పిలవాడలోని గిరిజనులకు ఉపాధి పనులు కల్పిస్తున్నట్టు గూడెంకొత్తవీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు గురువారం తెలిపారు. ఉపాధి పనులు లేకపోవడంతో తామంతా ఇబ్బందులు పడుతున్నామంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై 'సాక్షి'లో గురువారం 'ఉపాధి పనులు నిలిపివేయడం తగదు' అంటూ వార్త ప్రచురితమైంది. ఈ మేరకు అధికారులు స్పందించారు. గ్రామంలో గిరిజనులందరికీ ఉపాధి పనుల కల్పనకు చర్యలు చేపట్టారు. గురువారం నుంచి గ్రామస్తులంతా పనులకు వెళ్లారు.

రోడ్డు పనులు ప్రారంభించాలని డిమాండ్



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

డుంబ్రిగుడ: మండలంలోని కంద్రుమ్ పంచాయతీ జాకరగుడ గ్రామంలో గురువారం ప్రజా చైతన్యయాత్ర కార్యక్రమాన్ని సీపీఎం నాయకులు చేపట్టారు. ఈ సందర్భంగాపార్టీ మండల కమిటీ సభ్యుడు టి.సూర్యనారాయణ మాట్లాడుతూ వి.జె.రోడ్డు నుంచి సర్రాయి, కంద్రుమ్ మీదుకు డుంబ్రిగుడ వరకు రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రోడ్డు సౌకర్యం లేక వాహనాలు రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి పెద్ద వంతెన వద్ద నుంచి జకరగుడ వరకు రోడ్డు నిర్మాణం పనులు చేయాలన్నారు. రామచందర్. పరన్న, గోవర్ధన్, జిన్ను, లైకోన్, రఘు తదితరులు పాల్గొన్నారు.

అలవెన్సులు చెల్లించడంలో విఫలం



పాడేరు రూరల్: పీసా శిక్షణ తరగతుల అలవెన్సుల చెల్లించడంలో అధికారులు విఫలం చెందారని పీసా కమిటీ సంఘం గౌరవ అధ్యక్షుడు నల్ల రామకృష్ణ చెప్పారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ గత నెలల పీసా కమిటీ సభ్యులతో జరిగిన శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొన్న డ్వాక్రా, అంగన్‌వాడీ, ఏఎన్ఎం, ఎంపీటీసీ, జెడ్పిటీసీ, సర్పంచ్‌లకు చెల్లించాల్సిన టిఏ, డీఏ అలవెన్సులు చెల్లించలేదన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ కార్యక్రమంలో శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రలతో పాటు టిఏ, డిఏ చెల్లించాల్సి ఉన్నప్పటికీ , అధికారుల నిర్లక్ష్యం కారణంగా నేటికీ నెల రోజులు గడుస్తున్నా చెల్లించలేదన్నారు. అధికారులు స్పందించి తక్షణమే బకాయి పడ్డ అలవెన్సులు చెల్లించాలని లేనిపక్షంలో ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు.

కష్టాలు తీరేనా?



దిగువపేడాపల్లి ఉక్కుర్భ రోడ్డు దుస్థితి



ఊటనీరు తెచ్చుకుంటున్న సరియాపల్లి మహిళలు

- అధ్వానంగా ఉక్కుర్భ తారురోడ్డు
- ఆరు కిలోమీటర్లు నరకయాతన
- సరియాపల్లిలో తాగునీటి కష్టాలు
- కలుషిత నీటి వినియోగంతో ప్రబలుతున్న రోగాలు
- పట్టించుకోని అధికారులు

పెదబయలు: మన్యంలోని చాలా గ్రామాల్లో అధ్వాన దారులతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇందులో భాగంగా మండలంలోని వనభంగి పంచాయతీ దిగువపేడాపల్లి జంక్షన్ నుంచి ఉక్కుర్భ వరకు తారురోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఈ మార్గంలో సుమారు ఆరు కిలోమీటర్లు ప్రయాణం నరకంగా మారింది. ద్విచక్ర వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఉక్కుర్భ ఘాట్ రోడ్డు మరింత ప్రమాదభరితంగా తయారైంది. దిగువపేడాపల్లి నుంచి అరడకోట అలాగే ఉక్కుర్భ గ్రామం నుంచి చేదుపుట్టు పంచాయతీ కేంద్రం వరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తారురోడ్డు నిర్మాణం జరిగింది. ఇటీవల భారీ తుపానుల వల్ల కురిసిన వర్షాలకు రహదారులు దెబ్బతిన్నాయి. ఈ మార్గంలో సుమారు ఆరు కిలోమీటర్లు వరకు పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో ప్రయాణానికి స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. వాహనచోదకులు గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు అధికారులకు సమస్య విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు మీదుగా కిముడుపల్లి, కుంతుర్ల, వనభంగి, పెదకోడాపల్లి పంచాయతీ వాసులు మండల కేంద్రానికి వెళ్లేందుకు దారి దగ్గరవుతుందని ప్రస్తుతం రోడ్డు బాగా లేకపోవడంతో ఆయా పంచాయతీ వాసులు పాడేరు మండలం గుత్తులపుట్టు మీదుగా వెళ్లి పెదబయలు రావాల్సి వస్తుందని చెబుతున్నారు. ఈ విషయంపై ఆర్అండ్‌బీ అధికారులు మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారులకు ప్రతిపాదించామని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తారురోడ్డు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఊటనీరే శరణ్యం

పెదబయలు: వేసవి కాలం రాకముందే మండలం పలు గ్రామాలకు తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. పెదబయలు మండలంలోని గోమంగి పంచాయతీ కేంద్రం సరియాపల్లి గ్రామంలో గత రెండు నెలల నుంచి తాగునీటి సదుపాయం లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత్యంతరం లేక గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఊటగెడ్డలను ఆశ్రయిస్తున్నారు. కలుషిత నీటిని వినియోగించాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీ ఇంటికి కుళాయి నీరు అందిస్తామని ప్రకటనలు తప్ప పనులు అమలు చేయడం లేదంటున్నారు. గ్రామంలో తాగునీటి సమస్యను అధికారులకు తెలియచేసినా స్పందించడం లేదంటున్నారు. కలుషిత నీరు తాగడం వల్ల ప్రతీ ఇంట్లో జ్వరం, జలుబు ఇతర వ్యాధుల బారిన పడుతున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రతీ కుటుంబానికి సురక్షిత నీరు అందించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని చెబుతున్నారు. తాగునీటి పథకం మంజూరు చేసేంత వరకు సురక్షిత నీరు ట్యాంకుల ద్వారా సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రాళ్లు తేలిన ఘాట్ రోడ్డు

ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తాం

గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గతంలో అనేకమార్లు అధికారులకు విన్నవించామని స్పందించడం లేదని అధికారులు చెబుతున్నారు. తాగునీటి కష్టాలు అధికారులకు పట్టడం లేదా అని ప్రశ్నించారు. వెంటనే తాగునీటి ఎద్దడి తీర్చకపోతే పెదబయలు ఎంపీడీవో కార్యాలయం, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాల ఎదుట గ్రామస్తులు ముట్టడిస్తామని హెచ్చరించారు.

పొంచి ఉన్న ప్రమాదం



తాలబుతోట కల్వర్టుపై ఏర్పడిన గొయ్యి

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ తాలబుతోట గ్రామ సమీపంలో కల్వర్టుపై ఉన్న భారీ గొయ్యి ప్రమాదకరంగా తయారైంది. ఈ మార్గంలో నిత్యం రాకపోకలు చేసే వాహనచోదకులు భయం భయంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ మార్గంలో వాహనచోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టు ఏ క్షణమైనా కొంత భాగం కూలిపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని తాలబుతోట, నర్సిపుట్టు, మలుడుపుట్టు, బీట, తోటపుట్టు, గోడ్డిపుట్టు గ్రామస్తులు కోరుతున్నారు.

రక్తదాన శిబిరం రేపు



ప్రిన్సిపాల్, విజయభారతి

చింతపల్లి: మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో శనివారం ఉచిత రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి తెలిపారు. ఎన్ఎస్ఎస్, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని ప్రాణదాతలు కావాలని ఆమె కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అరకులో బోరు పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ జానకమ్మ



కొర్రాలో బోరు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ అర్జున్, బాలరాజు

డుంబ్రిగుడ: మండలంలోని జిల్లా పరిషత్ నిధులతో ఐదు తాగునీటి బోర్లు, ఒక సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సీసీ రోడ్డుకు రూ.5లక్షలు, ఒక్కో బోరు ఏర్పాటుకు రూ.1.40లక్షలతో పనులు చేపడుతున్నట్టు డుంబ్రిగుడ జెడ్పీటీసీ సభ్యురాలు చటారి జానకమ్మ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం అరకు పంచాయతీ కేంద్రంలోని గురువారం సీసీ రోడ్డుతో పాటు బోరు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ మాట్లాడుతూ మండల అభివృద్ధే ప్రధాన ధ్యేయమన్నారు. ప్రస్తుతం సుమారు రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు జరుగుతున్నట్టు చెప్పారు. అరకు పంచాయతీలొ రెండు బోర్లు, కొర్రాలో, కొల్లాపుట్టు పంచాయతీ మున్నిగుడలో, గుంటగన్నేల పంచాయతీ జాముగుడలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. అరకు పంచాయతీ సర్పంచ్ జి.శారద, కొర్రాలో సర్పంచ్ అర్జున్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.బి. బాలరాజు, కృష్ణారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దారాలమ్మ ఉత్సవాలు ప్రారంభం



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

సీలేరు: ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్య దైవం, గిరిజనుల కులదేవత ఘాట్‌రోడ్డులోని దారాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహూర్తపు రాటను వేశారు. ఈ కార్యక్రమానికి పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో సాంబశివరావు ఎమ్మెల్యేకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో భాగంగా అమ్మవారి గరగలకు పూజలు చేశారు. అనంతరం డప్పు వాయిద్యాల నడుమ పండుగను ప్రారంభించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ కొత్త అమావాస్య రోజు ప్రధాన పండుగ నిర్వహిస్తామని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సదుపాయాలు చేశామన్నారు. పండుగ జరిగే అన్ని రోజులు ఆలయ ప్రాంగణంలో నిత్యాన్నదానం నిర్వహిస్తామన్నారు. ఎంపీపీ కుమారి, దామనాపల్లి సర్పంచ్ రామకృష్ణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రీప్రైమరీ విద్యాభివృద్ధికి కృషి



డుంబ్రిగుడలో మాట్లాడుతున్న సీడీపీవో నీలిమ



జి.మాడుగులలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీడీపీవో సువర్ణమ్మ

అరకులోయటౌన్(అనంతగిరి)/డుంబ్రిగుడ/ పాడేరు రూరల్/ జి.మాడుగుల/కొయ్యూరు/రంపచోడవరం /అడ్డతీగల/చింతూరు/గంగవరం/ ఎటపాక : అంగన్‌వాడీ కేంద్రాల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పోషణ్ భీ..పడాయి భీ కార్యక్రమంలో గురువారం సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీడీపీవోలు, అధికారులు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆరు సంవత్సరాల లోపు ఉన్న పిల్లలందరికీ సమగ్ర అభివృద్ధిని పెంపొందించడానికి, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యా ప్రమాణాల నాణ్యతను మెరుగుపరిచే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతగిరిలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో సీహెచ్.సంతోషి కుమారి, సూపర్‌వైజర్లు శాంతిప్రియ, రామయ్యమ్మ, శ్యామల కుమారి, దాలింబి బి, సునీత, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. డుంబ్రిగుడలో సీడీపీవో నీలిమ తదితరులు పాల్గొన్నారు. పాడేరులో జరిగిన కార్యక్రమంలో యాస్పిరింగ్ భారత్ సహకార బృందం సభ్యుడు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. జి.మాడుగులలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో జి.సువర్ణమ్మ, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, సత్యవతి, పద్మావతి, లక్ష్మి, మణికుమారి, కొండమ్మ పాల్గొన్నారు. కొయ్యూరులో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో విజయకుమారి తదితరులు పాల్గొన్నారు. రంపచోడవరంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు. అడ్డతీగలలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో సీహెచ్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. చింతూరు జరిగిన కార్యక్రమంలో సీడీపీవో విజయగౌరి తదితరులు పాల్గొన్నారు. గంగవరం జరిగిన కార్యక్రమంలో సీపీడీవో సీహెచ్.లక్ష్మి , సూపర్‌వైజర్లు సత్యవతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఎటపాక జరిగిన కార్యక్రమంలో సీపీడీవో విజయగౌరి, సూపర్‌వైజర్లు ప్రియాంక, రాధ, పార్వతి, రమణమ్మ, యూడీసీ మురళి, ఐడీసీ రవి తదితరులున్నారు.



గంగవరంలో మాట్లాడుతున్న సీడీపీవో లక్ష్మి



కొయ్యూరులో మాట్లాడుతున్న సీడీపీవో విజయకుమారి



అడ్డతీగలలో శిక్షణ ఇస్తున్న సిబ్బంది



ఎటపాకలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీడీపీవో విజయగౌరి

300 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రాజవొమ్మంగి: మండలంలోని కొమరాపురంలో పలు కార్పొరేట్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యుడు ఎం.ఎస్.ఎల్. రాజు వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఇందులో 30 మందికి కంటి ఆపరేషన్లు అవసరమున్నట్టు గుర్తించి, వారిని విజయనగరం తరలించినట్టు పేర్కొన్నారు. విశాఖపట్నం మెడికవర్ ఆస్పత్రి డాక్టర్లు వై.శ్రావణ్, భాగ్యరాజ్‌లు కూడా ఈ శిబిరంలో ప్రజలకు వైద్య సేవలందించారు. వాతంగి, అమీనాబాద్, జడ్డంగి సర్పంచ్‌లు శుభలక్ష్మి, వెంకటలక్ష్మి, మురళీకృష్ణ. నాయకుడు శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమం



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఎటపాక: ఉష్ణగుండాల వద్ద జరుగుతున్న అష్టలక్ష్మి యాగంలో గురువారం సుదర్శన హోమం ఘనంగా నిర్వహించారు. పీతాంబరం రఘునాథచార్యులు ఆధ్వర్యంలో మంత్ర దీక్ష, సుదర్శన హోమం జరిపారు. సాయంత్రం అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భద్రాద్రి ఆలయ అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

డుంబ్రిగుడ: మండలంలోని కిల్లోగుడ పీహెచ్‌సీ వద్ద పాడేరు అగ్నిమాపక కేంద్రం అధికారి ఎ.వి.రమణ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలు, నీటి ప్రమాదాల నివారణపై గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వైద్యాధికారులు నజీబ్, కుమార్‌రత్న, ఉపేంద్ర, సిబ్బంది వెంకటేష్, జానకమ్మ పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



యువతకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేస్తున్న సీఐ నరసింహ మూర్తి, ఎస్‌ఐ రామకృష్ణ

వై.రామవరం: మండలంలోని కోట గ్రామంలో సీఐ బి.నరసింహమూర్తి, ఎస్ఐ బి.రామకృష్ణ గురువారం పర్యటించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి సాగు, రవాణా, సారా తయారీ, విక్రయాలు చట్టరీత్యా నేరమని వాటి జోలికి వెళ్లొద్దన్నారు. అసాంఘిక కార్యకలపాలకు దూరంగా ఉండాలని సూచించారు. యువత మంచి చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఏ సమస్య ఉన్న నేరుగా తమకు తెలియజేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కమ్యూనిటీ పోలీసింగు ద్వారా భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. నేరాలు అరికట్టడానికి సహకరించాలన్నారు. అనంతరం యువతకు వాలీబాల్ కిట్లను అందజేశారు. గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా చెరువు పనులు



ముంచంగిపుట్టులో జరుగుతున్న చెరువు పనులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో అంబేడ్కర్ పార్కు సమీపంలో ఉన్న చెరువు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా చెరువు అభివృద్ధికి ఎవరూ ముందుకు రాకపోవడం, నిధులు కేటాయించకపోవడంతో పూడికతో నిండిపోయింది. చెరువు అభివృద్ధిపై జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ప్రత్యేక దృష్టి పెట్టారు. ఉపాధి హామీ, జెడ్పీ నిధులు సుమారుగా రూ.20లక్షలు మంజూరు చేసి, చెరువు, అంబేడ్కర్ పార్కును అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా అంబేడ్కర్ పార్కు చుట్టూ ప్రహరీ నిర్మాణం పూర్తయింది. గత కొన్ని రోజులుగా చెరువులో పూడిక తీత, చెరువు చుట్టూ రాళ్ల అమర్చడం వంటి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎన్నో ఏళ్ల తరువాత చెరువు పనులకు మోక్షం కలగడంతో మండల కేంద్రం వాసులు జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర చొరవపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి సమస్యపై జెడ్పీ చైర్‌పర్సన్‌కు వినతి



జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ బాలయ్య పడాల్

చింతపల్లి: మండల కేంద్రంలో సాయినగర్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర రూ.10లక్షలు మంజూరుకు హామీ ఇచ్చినట్టు చింతపల్లి జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యపడాల్ తెలిపారు. విశాఖపట్నంలో జిల్లా పరిషత్ చైర్మన్ జల్లిపల్లి సుభద్రను ఆయన గురువారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో సాయినగర్‌లో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, గత్యంతరం లేక సుదూరం నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన వస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్‌కు తెలియజేశారు. దీనిపై జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర స్పందించి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారని, ఈ మేరకు రూ.10 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్టు బాలయ్య పడాల్ తెలిపారు.


తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న సీపీఎం నేతలు, బల్లుగూడ గ్రామస్తులు

ముంచంగిపుట్టు:మండలంలో గల బాబుశాల పంచాయతీ బల్లుగూడ గ్రామస్తులు తీవ్రమైన తాగునీటి సమస్యతో అల్లాడుతున్నా పట్టించుకునేవారే కరువు అయ్యారని సీపీఎం నేతలు త్రినాథ్, శ్రీను నర్సయ్యలు అన్నారు. బల్లుగూడ గ్రామంలో గురువారం సీపీఎం నేతలు పర్యటించారు. ఇటీవల ముగ్గురు చిన్నారుల మృతి, చాలా మంది చిన్నారులు వ్యాధుల బారిన పడడంపై ఆరా తీశారు. గ్రామంలో తాగునీటి సమస్యతో అవస్థలు పడుతున్నామని, కిలోమీటరు దూరం వెళ్లి నీటిని తీసుకువస్తున్నామని గ్రామస్తులు, సీపీఎం నేతల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా తాగునీటి ట్యాంకు వద్ద గిరిజనులు, సీపీఎం నేతలు ఆందోళన చేశారు. పలువురు నేతలు మాట్లాడుతూ బల్లుగూడ గ్రామంలో తాగునీటి సమస్యతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వ్యాధులు పెరుగుతున్నా కూటమి ప్రభుత్వం ఉన్నతాధికారులు బల్లుగూడ గ్రామం వైపు కన్నెత్తి చూడకపోవడం అన్యాయమన్నారు. గ్రామంలో నెలకొన్న అన్ని సమస్యలు, ముఖ్యంగా నీటి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని, లేని పక్షంలో గ్రామస్తులతో కలిసి మండల కేంద్రంలో ఆందోళన కార్యక్రమం చేపడతామని వారు హెచ్చరించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం



మాట్లాడుతున్న ట్రైకార్ డైరెక్టర్ కృష్ణారావు

జి.మాడుగుల: మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు కళ్యాణం అధ్యక్షతన పార్టీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ట్రైకార్ డైరెక్టర్, పార్టీ పాడేరు నియోజకవర్గం కన్వీనర్ కృష్ణారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. నాయకులు సింహాచలం, సుబ్బారావు, పార్వతమ్మ, చిరంజీవి, పద్మ, ఝాన్సీ తదితరలు పాల్గొన్నారు